

గర్వపడేలా సీఎం జగన్ పాలన

ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రజలందరూ గర్వపడేలా రాష్ట్రాన్ని పరిపాలిస్తున్నారని ఏపీ ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాస రావు అన్నారు. - 8లో



నకిలీ బంగారంతో టోకరా

పార్నపల్లె స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్‌లలో నకిలీ బంగారు ఆభరణాలు తాకట్టు పెట్టి లక్షల రూపాయలు రుణాలు తీసుకున్న ఘటన వెలుగులోకి వచ్చింది. - 8లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం
34.6 /27.6

జిల్లాలో మంగళవారం 27.6 - 34.6 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 3.7 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

ప్రశాంతంగా పరీక్షలు

కడప ఎడ్యుకేషన్ : విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను అంచనా వేసే కార్యక్రమంలో భాగంగా మంగళవారం జిల్లావ్యాప్తంగా అన్ని యాజమాన్య పాఠశాలల్లో ఫార్మేటివ్ అసెస్మెంట్ పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. 4వ తేదీ వరకు నిర్వహించనున్న ఈ పరీక్షలకు 3,13,696 విద్యార్థులు హాజరవుతున్నారు. ఇందులో 1 నుంచి 8వ తరగతి విద్యార్థులకు క్లాస్ రూమ్ బేస్డ్ అసెస్మెంట్ విధానంలో.. 9, 10 తరగతులకు చెందిన విద్యార్థులకు ఫార్మేటివ్ విధానంలో పరీక్షలను నిర్వహిస్తున్నారు. ఇందులో 1 నుంచి 8వ తరగతి వరకు విద్యార్థులకు బైలింగ్విల్ విధానంలో ప్రశ్నాపత్రాలను అందిస్తున్నారు. ఈ నేపథ్యంలో కడప నగరంలోని పలు పాఠశాలల్లో జరుగుతున్న పరీక్షలను సెక్టోరియల్ అధికారి దశరథరామిరెడ్డి పరిశీలించారు.

ఏపీఎల్‌కు ఎంపిక



వరుణ్‌తేజారెడ్డి

కడప స్పోర్ట్స్ : ఆంధ్రా ప్రీమియర్ లీగ్ సీజన్-2లో పాల్గొనే రాయలసీమ కింగ్స్ జట్టుకు యర్రగుంట్ల పట్టణానికి చెందిన వరుణ్ తేజారెడ్డి ఎంపికయ్యాడు. మంగళవారం నిర్వహించిన వేలంపాటలో రాయలసీమ కింగ్స్ జట్టు ఈయన్ను రూ.25వేలకు కొనుగోలు చేసింది. లెఫ్ట్ ఆర్మ్‌స్పిన్ బౌలర్, బ్యాట్స్‌మన్‌గా రాణిస్తున్న వరుణ్ అండర్-19, అండర్-23 జట్లకు వైఎస్ఆర్ కడప జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్నాడు.

రూ.10 వేలు దాటిన పసుపు ధర

కడప అగ్రికల్చర్ : పసుపు ధర కనీవినీ ఎరుగని రీతిలో రోజురోజుకు పైపైకి పాకుతోంది. నాలుగు రోజుల క్రితం రూ.9 వేలలోపు ఉన్న పసుపుధర క్రమేపీ పెరుగుతూ పదివేలకు దాటింది. మంగళవారం కడప మార్కెట్‌యార్డులో ఫింగర్ క్వింటాల్ పసుపు ధర రూ.10,312 పలకగా.. బల్బ్ ధర క్వింటాల్ రూ.10,069 పలకడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గడిచిన పదేళ్లలో ఇంత ధర ఎన్నడూ లేదంటూ సంబరపడుతున్నారు.

సేద్య పరికరాలను అందించండి

కడప అగ్రికల్చర్ : బిందు, తుంపర సేద్యం పరికరాల కోసం దరఖాస్తు చేసుకున్న రైతులకు సకాలంలో పరికరాలను అందించి వారి అభివృద్ధికి కృషి చేయాలని ఏపీ ఎంఐపీ ప్రాజెక్టు డైరెక్టర్ రవీంద్రనాథరెడ్డి చెప్పారు. మంగళవారం కడపలోని మైక్రో ఇరిగేషన్ జిల్లా కార్యాలయంలో కంపెనీ ప్రతినిధులు, మైక్రో ఇరిగేషన్ ఇంజినీర్లతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2023-24 సంవత్సరానికి జిల్లాలో 10,500 హెక్టార్లలో బిందు, తుంపర సేద్య పరికరాల ఏర్పాటు లక్ష్యంగా నిర్ణయించారన్నారు. రైతు భరోసా కేంద్రాల పరిధిలో బిందు, తుంపర పరికరాల అవసరం ఉన్న రైతులను గుర్తించి దరఖాస్తు చేసుకునే విధంగా అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎంఐపీ ఏపీడీ మురళీమోహన్‌రెడ్డి, కంపెనీ ప్రతినిధులు, మైక్రో ఇరిగేషన్ ఇంజినీర్లు పాల్గొన్నారు.

విద్యార్థుల వివరాలందించండి

కడప ఎడ్యుకేషన్ : 2023-24 విద్యా సంవత్సరానికి పరీక్షల ప్రశ్నపత్రాలను ముద్రించేందుకు ప్రతి పాఠశాలలోని విద్యార్థుల సంఖ్య వివరాలను తరగతులు, మీడియంవారీగా డీసీఈబీకి ఈ నెల 5వ తేదీలోపు అందచేయాలని డీఈఓ రాఘవరెడ్డి ప్రధానోపాధ్యాయులకు సూచించారు. మండల విద్యాశాఖ అధికారులు తమ పరిధిలోని అన్ని పాఠశాలల నుంచి విద్యార్థుల వివరాలను తెప్పించుకుని డీఈసీబీ కార్యాలయంలో అందచేయాలన్నారు. అలాగే డీసీఈబీకి గత సంవత్సరానికి సంబంధించి ప్రైవేటు పాఠశాలలు చెల్లించవలసిన ఫీజు బకాయిలు వెంటనే చెల్లించాలని కోరారు.

రక్తహీనతను నివారించండి




మాధవరం పీహెచ్‌సీ సిబ్బందితో ముఖాముఖి నిర్వహిస్తున్న జిల్లా వైద్యాధికారి డాక్టర్ నాగరాజు

సిద్దవటం : కొత్త అనీమియా మీటర్లతో కిశోర బాల, బాలికలకు ఏఎన్ఎంలు హీమోగ్లోబిన్‌ను పరీక్షించి రక్త హీనతను నివారించాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ నాగరాజు తెలిపారు. సిద్దవటం మండలంలోని మాధవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం ఆయన తనిఖీ చేశారు. అనంతరం పీహెచ్‌సీలో జరుగుతున్న ఆశాడే సమావేశానికి హాజరయ్యారు. ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు, సూపర్‌వైజర్లు, సీహెచ్‌ఓలతో ముఖాముఖి నిర్వహించి పలు సూచనలు చేశారు. ఆగస్టు 7వ తేదీన మిషన్ ఇంద్రధనస్సును, 10న నులిపురుగుల దినోత్సవాన్ని ప్రణాళికాబద్ధంగా నిర్వహించాలని వైద్యాధికారి డాక్టర్ శివకుమార్‌ను ఆదేశించారు.

• బాబు మాటలు

నీటి మీద రాతలు





ముద్దనూరు మండల శెట్టివారిపల్లె వద్ద చంద్రబాబునాయుడు వేసిన శిలాఫలకం(ఫైల్), నిండుకుండలా ఉన్న గండికోట జలాశయం

- రాయలసీమ ప్రాజెక్టుల పట్ల చంద్రబాబుకు అంతులేని నిర్లక్ష్యం
- జీఎన్ఎస్ఎస్‌కు ప్రాధాన్యత ఇచ్చింది వైఎస్సార్, వైఎస్ జగన్ ప్రభుత్వాలే
- చంద్రబాబు హయాంలో నామమాత్రపు వెచ్చింపు
- ప్రాజెక్టుల సందర్శన పేరుతో మరోమారు కొత్త డ్రామాకు తెర
- గండికోటకు రెండు సార్లు శిలాఫలకాలు వేసిన ఘనత బాబుదే
- నేడు 26 టీఎంసీల నీరుతో కళకళలాడుతున్న గండికోట

సాక్షి ప్రతినిధి, కడప : 'వినేవారు లోకువైతే చెప్పేవారు చంద్రబాబు' అన్న విషయాన్ని మరోమారు టీడీపీ అధినేత చంద్రబాబు రుజువు చేస్తున్నారు. అధికారంలో ఉన్నన్నాళ్లు సాగునీటి ప్రాజెక్టుల పట్ల చిత్తశుద్ధి చూపకుండా, విపక్షనేతగా ప్రాజెక్టుల సందర్శన పేరుతో మరో కొత్తడ్రామాకు తెరలేపారు. గండికోట ప్రాజెక్టు నిర్మాణానికి 1996, 99 ఎన్నికలకు ముందు రెండుసార్లు శంకుస్థాపన చేయడం మినహా, ఆ ప్రాజెక్టు నిర్మాణం పట్ల చంద్రబాబు సర్కార్ నిర్లక్ష్యమే ప్రదర్శించింది. పైగా రాయలసీమలో తమకు ఓట్లు, సీట్లు రావని.. అందుకే అభివృద్ధి చేయలేదని నిర్లజ్జగా ప్రకటించడం మరో వింత. నిర్దిష్ట అభివృద్ధి సాధించే అవకాశం ఉన్నా జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టు పట్ల టీడీపీ సర్కార్ అంతులేని నిర్లక్ష్యం ప్రదర్శించింది.

1995 నుంచి 2004 వరకు తొమ్మిదేళ్లు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా, 2014-19 విభజిత ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు సాగునీటి ప్రాజెక్టుల పట్ల పూర్తి నిర్లక్ష్యం చూపారు. రాయలసీమ సాగునీటి ప్రాజెక్టులంటే మండిపడేవారు. తాజాగా 25 టీఎంసీల నీరు నిల్వకు కారణమైన గండికోట ప్రాజెక్టును ఉమ్మడి ఏపీలో నాన్ ప్రియారిటీ జాబితాలోకి చేర్చిన పాపాన్ని చంద్రబాబు మూటగట్టుకున్నారు. అప్పట్లో ముఖ్యమంత్రిగా వైఎస్ రాజశేఖర రెడ్డి రాయలసీమ సాగునీటి ప్రాజెక్టులకు నీరు చేరాలంటే పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ విస్తరణ ఒక్కటే మార్గమని తలిచారు. అలా చేస్తేనే కాస్తో, కూస్తో రాయలసీమ ప్రాంతానికి నీరు చేరుతుందని మనస్ఫూర్తిగా నమ్మారు. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ సామర్థ్యాన్ని వైఎస్సార్ సర్కార్ పెంచుతుంటే, టీడీపీ నేత దేవినేని ఉమామహేశ్వరావు ద్వారా అడ్డుకునే ప్రయత్నం చేసింది కూడా చంద్రబాబే. 2014లో అధికారంలోకి వచ్చిన తర్వాతైనా ఈ ప్రాంత ఉన్నతికి కృషి చేస్తారనుకుంటే.. ఐదేళ్ల కాలాన్ని ఊకదంపుడు ఉపన్యాసాలతో సరిపెట్టారని పలువురు గుర్తు చేస్తున్నారు.

శంకుస్థాపనతో సరి..

గండికోట ప్రాజెక్టుకు 1996 ఫిబ్రవరి, 29న సీఎం హోదాలో చంద్రబాబునాయుడు శెట్టివారిపల్లె సమీపంలో శంకుస్థాపన చేశారు. తర్వాత వామికొండ వద్ద మరోమారు 1999 ఎన్నికలకు ముందు శంకుస్థాపన చేశారు. ఆ తర్వాత ఆ ప్రాజెక్టు పట్ల ఏమాత్రం శ్రద్ధాసక్తులు చూపలేదు. మరోవైపు గండికోటను నాన్ ప్రియారిటీ జాబితాలోకి చేర్చారు. 2004లో అధికారంలో దివంగత వైఎస్ రాజశేఖర రెడ్డి వచ్చాకే ప్రాజెక్టుల పనులను పరుగులు పెట్టించారు. ఆయన హయాంలో రూ.3213 కోట్లు వెచ్చిస్తే, తర్వాత అధికారంలోకి వచ్చిన చంద్రబాబు కేవలం రూ.804 కోట్లు మాత్రమే వెచ్చించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి పగ్గాలు అందుకున్న తర్వాత జీఎన్ఎస్ఎస్ పరిధిలో రూ.4256 కోట్లు వ్యయం చేశారు. మరో రూ.454 కోట్లు నిర్వాసితులకు చెల్లించేందుకు ప్రభుత్వ ఉత్తర్వులు విడుదల చేశారు. మంత్రివర్గ సమావేశం సైతం ఆమోదం తెలిపింది. పైగా 26.85 టీఎంసీల నీరు నిల్వ చేసిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సర్కార్‌కే దక్కిందని పలువురు వివరిస్తున్నారు.

కరువు నిరారణకు ప్రత్యేక ప్రణాళిక..

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రాయలసీమ కరువు నివారణకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించింది. జీఎన్ఎస్ఎస్-హెచ్ఎన్ఎస్ఎస్ అనుసంధానం ప్రక్రియను ప్రారంభించి వేగవంతంగా పనులు చేపడుతోంది. 12టీఎంసీల నీరు జీఎన్ఎస్ఎస్ ద్వారా లిఫ్ట్ చేసి చిత్తూరు, అన్నమయ్య జిల్లాల్లో కరువు నివారణకు శ్రీకారం చుట్టింది. హెచ్ఎన్ఎస్ఎస్ కాలువలో జంగం దేవరపల్లె వద్ద నీరు కలపడం ద్వారా పీలేరు, మదనపల్లె, తంబళ్లపల్లె, పుంగనూరు, పలమనేరు, కుప్పం, రాయచోటి నియోజకవర్గాలను సస్యశ్యామలం చేసేందుకు యోగ్యకరంగా మారింది. వాస్తవం ఇలా ఉంటే రాజకీయాల కోసం టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు కొత్త డ్రామాకు సిద్ధమయ్యారని విశ్లేషకులు వెల్లడిస్తున్నారు.

జిల్లాలోని ఆయా ప్రాజెక్టుల నిర్మాణాలకు దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ప్రస్తుత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలలో ఖర్చు చేసిన వివరాలు (రూ.కోట్లలో)

ప్రాజెక్టు	వైఎస్సార్ హయాం (2014కు ముందు)	చంద్రబాబు సర్కార్ (2014-19)	వైఎస్ జగన్ సర్కార్ (2019-23)
గండికోట	819	413.5	504
సర్వారాయసాగర్	209.48	78.9	212
జీఎన్ఎస్ఎస్ మెయిన్ కెనాల్	405.3	164.9	698.3
సీబీఆర్	601	24.28	250.68
సీబీఆర్ రైట్ కెనాల్	352.8	9.80	55.50
పైడిపాళెం	736.9	113.5	142
గండికోట టన్నల్ విస్తరణ	-	-	250
అవుకు టు గండికోట కెనాల్ విస్తరణ	-	-	500
ఆర్డీఎంపీ (రాయల సీమ డ్రాట్ మిటిగేషన్ ప్రాజెక్టు)	-	-	1644
మొత్తం ఖర్చు	రూ.3123.68 కోట్లు	రూ.804.88 కోట్లు	రూ.4256.48కోట్లు

నేడు చంద్రబాబు పర్యటన

జమ్మలమడుగు: నియోజకవర్గంలో టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారాచంద్రబాబు నాయుడు బుధవారం పర్యటించబోతున్నారని, ఈ పర్యటనను టీడీపీ శ్రేణులు విజయవంతం చేయాలని టీడీపీ ఇన్‌చార్జి సుబ్బరామిరెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రాజెక్టుల సందర్శనలో భాగంగా చంద్రబాబు ఉదయం తొమ్మిదిన్నర గంటలకు మున్సిపాలిటి పరిధిలోని మోరగుడి మూడు రోడ్ల నుంచి రామిరెడ్డిపల్లె రోడ్డు, పెద్దపసుపల మోటు, సంజామల మోటు పాతబస్టాండ్‌మీదుగా ముద్దనూరు వైపు వరకు రోడ్‌షో ఉంటుందన్నారు. అనంతరం ముద్దనూరు, కొండాపురం మీదుగా గండికోట ప్రాజెక్టును సందర్శిస్తారన్నారు. ఈ కార్యక్రమాన్ని టీడీపీ శ్రేణులు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

'సీమ'కు బాబు క్షమాపణ చెప్పాలి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

- పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ పెంపును వ్యతిరేకించిన చంద్రబాబు
- ప్రకాశం బ్యారేజీపై ధర్నా చేసిన దేవినేని ఉమాను ఇరిగేషన్ మంత్రిని చేశారు
- బాబు హయాంలో కేసీకి నీరివ్వకపోతే ధర్నాలు చేయాల్సి వచ్చింది
- గాలేరునగరి, హంద్రీనీవా ప్రాజెక్టులను వద్దన్నారు
- ఏ మొహం పెట్టుకొని ప్రాజెక్టుల పర్యటనకు వస్తున్నారు
- కర్నూలులో హైకోర్టు ఏర్పాటు చేస్తామని ప్రకటించండి
- రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ పథకానికి సహకరిస్తానని మాట ఇవ్వండి
- డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, ప్రభుత్వ విప్ గడికోట శ్రీకాంత్‌రెడ్డి, ఎమ్మెల్యే రఘురామిరెడ్డిల ధ్వజం

కడప కార్పొరేషన్ : ప్రతిపక్షనేత చంద్రబాబు రాయలసీమకు చేసిన ద్రోహానికి ప్రాజెక్టుల వద్ద బోర్లా పడుకొని క్షమాపణ చెప్పాలని డిప్యూటీ సీఎం అంజద్ బాషా, ప్రభుత్వ విప్ గడికోట శ్రీకాంత్‌రెడ్డి, ఎమ్మెల్యే రఘురామిరెడ్డి డిమాండ్ చేశారు. కడప వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో బద్వేల్ ఎమ్మెల్యే డా.దాసరి సుధ, మేయర్ సురేష్ బాబుతో కలిసి వారు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అంజద్ బాషా మాట్లాడుతూ 2014 అధికారంలోకి వచ్చిన తర్వాత గండికోట వద్దకు వచ్చి కాలువ గట్లపై పడుకొని ప్రాజెక్టులను పూర్తి చేస్తానని చెప్పిన చంద్రబాబు, ఏ ప్రాజెక్టును పూర్తి చేశారో చెప్పాలని ప్రశ్నించారు. పులివెందుల్లో బస్టాండు కూడా కట్టలేకపోయారని గతంలో విమర్శించిన చంద్రబాబు ఇప్పుడు వెళ్లి బస్టాండు కట్టారో, లేదో చూడాలని సూచించారు. 14 ఏళ్లు సీఎంగా ఉండి కుప్పానికి ఏమీ చేయలేకపోయారని, వైఎస్ జగన్ సీఎంగా అయ్యాకే కుప్పాన్ని రెవెన్యూ డివిజన్ చేశారని తెలిపారు.

పర్యటనకు ఎలా వస్తున్నారు..

ఏ మొహం పెట్టుకొని చంద్రబాబు రాయలసీమ ప్రాజెక్టుల సందర్శనకు వస్తున్నారో చెప్పాలని ఎమ్మెల్యే రఘురామిరెడ్డి నిలదీశారు. 1984లో దివంగత ఎన్టీఆర్ 50 టీఎంసీల సామర్థ్యంతో వెలుగోడు, 70 టీఎంసీల సామర్థ్యంతో బ్రహ్మంసాగర్ ప్రాజెక్టు పనులను ప్రారంభించారన్నారు. 1989-1994 మధ్య కాంగ్రెస్ హయాంలో కొంతమేరకు పనులు జరిగాయని, 1994 నుంచి ఎన్టీఆర్‌ను ఏ రకంగా పదవీచ్యుతుణ్ణి చేశారో రాష్ట్ర ప్రజలందరికీ తెలుసన్నారు. జిల్లా ప్రజల అదృష్టం కొద్దీ 2004లో వైఎస్సార్ ముఖ్యమంత్రి అయ్యాక ప్రాజెక్టు పనులన్నీ యుద్ధ ప్రాతిపదికన కొనసాగాయన్నారు. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ సామర్థ్యాన్ని 11వేల నుంచి 44వేల క్యూసెక్కులకు పెంచుతుంటే ప్రకాశం బ్యారేజీ వద్ద దేవినేని ఉమాతో ధర్నా చేయించిన ఘనత బాబుకే దక్కుతుందన్నారు. రాయలసీమపై అంత అక్కసు ఉన్న దేవినేని ఉమాను ఇరిగేషన్ శాఖామంత్రిని చేసి సీమవాసులకు తీవ్ర అన్యాయం చేశారని ధ్వజమెత్తారు. వెలుగోడు నుంచి 5వేల క్యూసెక్కుల నీటిని తెచ్చుకోవాలంటే 0 నుంచి 18 కి.మీ వరకూ కెనాల్‌ను రిపేర్ చేయాలని కోరితే చాలా నిర్లక్ష్యంగా వ్యవహరించారని, చంద్రబాబు సీఎంగా ఉన్న కాలంలో ఏ ప్రాజెక్టులో తట్టెడు మట్టి కూడా వేయలేదని.. ఒక్క ఏడాది కూడా బ్రహ్మంసాగర్‌లో 5 టీఎంసీలకు మించి నిల్వ చేసిన చరిత్ర లేదన్నారు. వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత రూ.500కోట్లు ఖర్చు చేసి ఆ కెనాల్‌ను పూర్తి చేయడం వల్ల గతంలో ఎన్నడూ లేనివిధంగా బ్రహ్మంసాగర్‌లో 17 టీఎంసీల నీటిని నిల్వ ఉంచడం జరిగిందన్నారు. ప్రస్తుతం ఈ ప్రాజెక్టు జిల్లాకు ప్రాణాధారంగా తయారైందన్నారు. దీన్నుంచి ఆర్టీపీపీకి, బద్వేల్, కడపకు తాగునీరు, కొప్పర్తి పారిశ్రామిక వాడకు నీరందిస్తున్నారన్నారు. బాబు హయాంలో కేసీకి నీరివ్వకపోతే తాము ధర్నా చేయాల్సి వచ్చిందని, ప్రస్తుతం జూలై 1వ తేదినే ఖరీఫ్‌కు నీరందించినట్లు వివరించారు.

ఈ ప్రశ్నలకు బదులేది..

రాయలసీమ ప్రాజెక్టులకు ప్రాణాధారమైన పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్‌ను, గాలేరు నగరి, హంద్రీనీవాలను ఎందుకు వద్దన్నారో చంద్రబాబు సమాధానం చెప్పాలని ప్రభుత్వ విప్, అన్నమయ్య జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు గడికోట శ్రీకాంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. గాలేరు నగరి, హంద్రీనీవా ప్రాజెక్టులను ఆనాడే పూర్తి చేసి ఉంటే బ్రిజేష్ ట్రిబ్యునల్ ప్రకారం నికర జలాలు ఆ ప్రాజెక్టులకు వచ్చేవన్నారు. తెలుగుగంగకు 1984 నుంచి 2004 వరకూ 20 ఏళ్లలో రూ.1700కోట్లు ఖర్చు చేస్తే, వైఎస్ఆర్ సీఎంగా ఉన్న ఐదేళ్లకాలంలో రూ.2300కోట్లు ఖర్చు చేశారని తెలిపారు. హంద్రీనీవా, గాలేరు నగరికి 20 ఏళ్లలో రూ.13కోట్లు ఖర్చు చేస్తే, వైఎస్సార్ రూ.6400కోట్లు ఖర్చు చేశారన్నారు. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ పెంపు కోసం రూ.4400కోట్లు వినియోగించారన్నారు. 2014-19 మధ్య కాలంలో చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు రూ.2వేలకోట్లు కాంట్రాక్టర్లకు దోచిపెట్టారన్నారు. చంద్రబాబు ఆలోచనల నుంచి వచ్చిన ఒక్క ప్రాజెక్టు కూడా రాయలసీమలో లేదన్నారు. ఏ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసి, పూర్తిచేశారో బాబు చెప్పాలన్నారు. గండికోట ముంపువాసులకు రూ.1000కోట్లు పరిహారం ఇచ్చి 27 టీఎంసీలు నిల్వ ఉంచారని, పైడిపాలెంలో 6 టీఎంసీలు, చిత్రావతిలో ఎఫ్ఆర్ఎల్ స్థాయికి నింపిన ఘనత వైఎస్ జగన్మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. పోతిరెడ్డిపాడును 44వేల క్యూసెక్కుల నుంచి 80వేల క్యూసెక్కులకు పెంచి రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ పథకానికి వైఎస్ జగన్ శ్రీకారం చుడితే దాన్ని చంద్రబాబు వ్యతిరేకించారని, ఈలోపు తెలంగాణ వారు ఎన్‌జీటీకి వెళ్లి స్టే తెచ్చారన్నారు. గుండ్రేవులకు బాబు టెంకాయ మాత్రమే కొట్టారని, అన్ని క్లియరెన్సులు తేవడానికి వైఎస్ జగన్ కృషి చేస్తున్నారన్నారు. సిద్దేశ్వరంను కూడా తాము పూర్తి చేస్తామన్నారు. కడప గూండాలు, రాయలసీమ రౌడీలని పదే పదే మాట్లాడిన చంద్రబాబు ఏ మొఖం పెట్టుకొని ఈ ప్రాంతానికి వస్తున్నారో చెప్పాలని నిలదీశారు. వెలిగల్లు ప్రాజెక్టుకు బాబు మూడు సార్లు శంకుస్థాపన చేశారని, వైఎస్ ఒకటిన్నర సంవత్సరంలో పూర్తి చేశారని గుర్తు చేశారు. కర్నూల్‌లో హైకోర్టు పెడతామని, రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్‌కు సహకరిస్తామని బాబు మాట ఇచ్చి ఇక్కడ అడుగుపెట్టాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్, ఏపీ సోషల్ వెల్ఫేర్ బోర్డు చైర్మన్ పులి సునీల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వెలుగులీనుతున్న నవరత్నాలు

- విద్యుత్ శాఖలో తొమ్మిది రకాల పథకాలు
- మొదటి స్థానంలో వ్యవసాయానికి ఉచిత విద్యుత్
- సంక్షేమం, వినియోగదారులకు మేలు చేసే పథకాలకు చోటు
- కడప సర్కిల్‌లో గత ఏడాది రూ.వేయి కోట్లకు పైగా ఖర్చు
- 2.14లక్షల మందికి ప్రయోజనం



విద్యుత్ పంపిణీ వ్యవస్థ

కడప కార్పొరేషన్ : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'నవ రత్నాలు' సరికొత్త చరిత్రను సృష్టించాయి. ఇందులోని పథకాలను చూసి ఇతర రాష్ట్రాలు సైతం అమలు చేసేందుకు ఆసక్తి చూపుతున్నాయి. ఈ నవ రత్నాల్లాగే దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థలో కూడా తొమ్మిది రకాల పథకాలతో సామాన్యులకు లబ్ధి చేకూరుతోంది. వైఎస్సార్ ఉమ్మడి జిల్లాలో ఇందుకోసం విద్యుత్‌శాఖ వేల కోట్లు ఖర్చు చేస్తోంది.

ప్రజలకు మేలు చేసేలా..

విద్యుత్ శాఖ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు మేలు చేసేలా రూపొందించారు. ఉచిత విద్యుత్, పేదలందరికీ ఇళ్లు, ఆక్వా రైతులకు సబ్సిడీ, ఎస్సీ, ఎస్టీలకు నెలకు 200 యూనిట్ల వరకూ ఉచిత విద్యుత్, క్షౌర శాలలు, లాండ్రీలకు నెలకు 150 యూనిట్లు, దోబీ ఘాట్లకు ఉచిత విద్యుత్, మోస్ట్ బ్యాక్‌వర్డ్ క్లాస్‌కు 100 యూనిట్ల వరకూ ఉచిత విద్యుత్, స్వర్ణకారులు, చేనేత మగ్గాలకు, పవర్ లూమ్స్‌కు నెలకు 100 యూనిట్ల వరకూ ఉచిత విద్యుత్, పవర్ ఫర్ ఆల్ నిరంతర విద్యుత్ సరఫరాలో అంతరాయ నిర్మూలన, సమస్యల పరిష్కారం కోసం గ్రామ, వార్డు సచివాలయాల్లో ఎనర్జీ అసిస్టెంట్లు(జూనియర్ లైన్‌మెన్ గ్రేడ్-2)నియామకం వంటివి చేర్చారు.

ఏడాదిలో కోట్లాది రూపాయల ఖర్చు

విద్యుత్ శాఖ తెచ్చిన పథకాల ద్వారా భారీగా నిధులు ఖర్చు చేస్తున్నారు. జిల్లాలో ఈ పథకాల కోసం ఒక ఏడాదిలో రూ.1053 కోట్లు ఖర్చు చేశారు. వీటి ద్వారా 2,14,711 మందికి మేలు చేకూరింది. నాలుగేళ్లలో పరిశీలిస్తే దీని విలువ నాలుగు రెట్లు ఉంటుందని అంచనా. కేవలం విద్యుత్ సంస్థ ద్వారానే ఇన్ని కోట్లు ఖర్చు చేస్తున్న ప్రభుత్వం పేదలకు లబ్ధి చేకూర్చేందుకు ఇతర శాఖల ద్వారా చేస్తున్న మేలు అంచనాకు అందడం లేదు.

వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యత

వ్యవసాయ రంగానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్న రాష్ట్ర ప్రభుత్వం రైతుల అవసరాలు తీర్చేందుకు ఎలాంటి కొరత లేకుండా నిధులు మంజూరు చేస్తోంది. ఇదే తరహాలో విద్యుత్ పంపిణీ సంస్థ కూడా వ్యవసాయానికి ఉచిత విద్యుత్ పథకాన్ని చేర్చింది. అన్ని స్కీముల కంటే అత్యధిక మంది లబ్ధి పొందుతున్న పథకం ఇదే. ఈ స్కీంకే ప్రభుత్వం కూడా అధిక నిధులు వెచ్చిస్తోంది. మరో ముఖ్యమైన పథకం ఎస్సీ, ఎస్టీలకు నెలకు 200 యూనిట్ల వరకూ ఉచిత విద్యుత్ అందించడం. ఉచిత విద్యుత్ తర్వాత అత్యధిక మంది లబ్ధిదారులు ఈ పథకంలోనే ఉన్నారు.

కడప సర్కిల్‌లో విద్యుత్ పథకాల ద్వారా ఏడాదిలో చేసిన ఖర్చు వివరాలు

విద్యుత్ పథకాలు	లబ్ధిదారుల సంఖ్య	ఖర్చు
వ్యవసాయానికి 9గంటల ఉచిత విద్యుత్	1,05,692	రూ.930కోట్లు
పేదలందరికీ ఇళ్లు	12,009	రూ.39కోట్లు
ఎస్సీ, ఎస్టీలకు నెలకు 200యూనిట్లు ఫ్రీ	95,513	రూ.37.04కోట్లు
క్షౌర శాలలు, దోబీ ఘాట్లు, లాండ్రీలకు నెలకు 150 యూనిట్లు ఉచిత విద్యుత్	458	రూ.40లక్షలు
స్వర్ణకారులకు చేనేత మగ్గాలకు, పవర్ లూమ్స్‌కు నెలకు 100 యూనిట్ల వరకూ ఉచిత విద్యుత్	458	రూ.20లక్షలు
పవర్ ఫర్ ఆల్ నిరంతరాయ విద్యుత్ సరఫరా కోసం	--	రూ. 27 కోట్లు
గ్రామ, వార్డు సచివాలయాల స్థాయిలో విద్యుత్‌సేవల కోసం ఎనర్జీ అసిస్టెంట్లు నియామకం	581	రూ.19.56 కోట్లు
ఆక్వా రైతులకు సబ్సిడీ (ఉమ్మడి జిల్లాలో ఆక్వాకల్చర్ లేదు)	---	---

విద్యుత్ పథకాలతో విస్తృత లబ్ధి



రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నవరత్నాలు చరిత్ర సృష్టించాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టిన ఈ పథకాలు ప్రతి గడపకు మేలు చేకూర్చుతున్నాయి. ఇదే తరహాలో ఏపీఎస్‌పీడీసీఎల్‌లో అమలవుతున్న పథకాలను తొమ్మిది విభాగాలుగా విభజించడం జరిగింది. వీటి వల్ల ఎక్కువ మందికి ప్రయోజనం కలుగుతోంది.

– ఎస్.రమణ, పర్యవేక్షక ఇంజినీరు, ఏపీఎస్‌పీడీసీఎల్, కడప ఆపరేషన్ సర్కిల్

పింఛనానందం

- మొత్తం 2,51,420 మందికి పింఛన్లు
- ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేస్తున్న వలంటీర్లు

కడప రూరల్ : ప్రతి నెలా ఒకటో తేదీన క్రమం తప్పకుండా పింఛన్ల పండుగ జరుగుతోంది. వైఎస్సార్ పింఛన్ కానుక కింద జిల్లాలో మంగళవారం వలంటీర్ల ద్వారా పింఛన్ల నగదు పంపిణీ జరిగింది. ఉదయాన్నే ఆ ప్రాంత వలంటీర్‌లు ఇంటింటికీ వెళ్లి అవ్వాతాతలు, ఇతర కేటగిరీలకు చెందిన వారికి పింఛన్ల నగదును పంపిణీ చేశారు. మొత్తం 2,51,420 పింఛన్లకు గాను మొత్తం రూ.69,37,06,750 నగదును అందజేయాలి. సాయంత్రం 5 గంటల ప్రాంతానికే 1,39,645 మందికి రూ 38,37,82,250 నగదును పంపిణీ చేశారు.. తెల్లారకముందే పింఛన్ చేతికి రావడం పట్ల పండుటాకులు పింఛనానందం పొందుతున్నారు.



ఇక్కడ కనిపిస్తున్న వృద్ధురాలి పేరు సుబ్బమ్మ. కడప నగరం నాగరాజుపేట శ్రీహరిరావువీధిలో నివసిస్తోంది. ఆ ప్రాంత వలంటీర్ షెహనాజ్ వేకువజామునే వెళ్లి సుబ్బమ్మను పలకరించింది. కుశల ప్రశ్నలు వేసింది. అనంతరం పింఛన్ నగదును అందజేసింది. దీంతో సుబ్బమ్మ వలంటీర్ వైపు ఆప్యాయంగా చూసింది. 'నా మనవడు జగనయ్య చల్లంగుండాలమ్మా, మీ ద్వారా మా లాంటి వారి కోసం ఇంటి వద్దకే పింఛన్‌ను పంపిస్తున్నారు. ఇంతకుముందైతే ఈ లెక్క కోసం ఎక్కడెక్కడికో వెళ్లి నీరసించిపోయే వాళ్లం. మా జగనయ్య వచ్చాక ఆ శ్రమ తప్పింది' అంటూ సంతోషం వ్యక్తం చేసింది.

వైఎస్సార్, నంద్యాల రీజినల్ కో-ఆర్డినేటర్‌గా ఆకేపాటి


ఆకేపాటి అమర్‌నాథ రెడ్డి

కడప కార్పొరేషన్ : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వైఎస్సార్, నంద్యాల జిల్లాల రీజినల్ కో–ఆర్డినేటర్‌గా జిల్లా పరిషత్ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి నియమితులయ్యారు. పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ నియామకం జరిగినట్లు పార్టీ కేంద్ర కార్యాలయం ఒక ప్రకటనలో తెలియజేసింది. కాగా ఆకేపాటి అమర్‌నాథరెడ్డి వైఎస్సార్ సీపీ ఆవిర్భావం నుంచి పార్టీలో కొనసాగుతున్నారు. ప్రస్తుతం జిల్లా పరిషత్ చైర్మన్‌గా సమర్థవంతగా పనిచేస్తున్నారు.

కర్నూలు, అన్నమయ్య జిల్లాల రీజినల్ కో–ఆర్డినేటర్‌గా రామసుబ్బారెడ్డి


రామసుబ్బారెడ్డి

కర్నూలు, అన్నమయ్య జిల్లాల రీజినల్ కో ఆర్డినేటర్‌గా ఎమ్మెల్సీ పి.రామసుబ్బారెడ్డి నియమితులయ్యారు. జిల్లాలో సీనియర్ నాయకుడిగా ఉంటున్న రామసుబ్బారెడ్డి గతంలో మంత్రిగా పనిచేశారు. గత ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ఆశయాలు నచ్చి పార్టీలోకి వచ్చారు. గత మున్సిపల్, పంచాయతీ, స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ మద్దతుదారుల విజయానికి విశేష కృషి చేశారు. ఆయనకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఎమ్మెల్సీ పదవి ఇచ్చి గౌరవించారు.

సెంట్రల్ జోన్‌కు భారీ ఆధిక్యం

కడప స్పోర్ట్స్ : కడప నగరంలోని వైఎస్ రాజారెడ్డి–ఏసీఏ క్రికెట్ మైదానంలో నిర్వహిస్తున్న ఏసీఏ సౌత్‌జోన్ అంతర్ జిల్లాల మల్టీడేస్ క్రికెట్ టోర్నమెంట్ రసవత్తరంగా సాగుతోంది. రెండోరోజు మంగళవారం 289 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో బరిలోకి దిగిన నార్త్‌జోన్ జట్టు 9 వికెట్ల నష్టానికి 457 పరుగులు చేసింది. జట్టులోని యశ్వంత్ 134 పరుగులు చేశాడు. అచ్యుత్ హేమంత్‌కుమార్ 52 పరుగులు చేశాడు. సెంట్రల్ జోన్ బౌలర్ గీత్ 3 వికెట్లు తీశాడు. రెండోరోజు ఆట ముగిసే సమయానికి సెంట్రల్ జోన్ 49 ఓవర్లలో 1 వికెట్ నష్టానికి 170 పరుగులు చేసింది. జట్టులోని ఆనంద్ 80 పరుగులు, తౌఫిక్ 72 పరుగులు చేశారు. ప్రస్తుతం సెంట్రల్ జోన్ జట్టు 287 పరుగుల ఆధిక్యంలో కొనసాగుతోంది.

రోడ్డుకు అడ్డంగా బోల్తా..


రోడ్డుకు అడ్డంగా పడ్డ లారీ

పోరుమామిళ్ల : పోరుమామిళ్ల – మైదుకూరు రోడ్‌లో దిగువ సగిలేరు ప్రాజెక్టు సమీపంలో మంగళవారం మధ్యాహ్నం ఓ లారీ బోల్తా కొట్టి రోడ్డుకు అడ్డంగా పడిపోయింది. ఈ ఘటనలో ఎవరూ గాయపడలేదు. కాకపోతే లారీ రోడ్డుకు అడ్డం పడటంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. మైదుకూరు వైపు వెళుతున్న ఈ లారీని డ్రైవర్ అతివేగంగా నడుపుతూ మోరీని ఢీ కొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. లారీ అడ్డం పడటంతో గంట పాటు ఇరువైపులా వాహనాలు నిలిచిపోయాయి. అక్కడున్నవారు అటుగా వెళుతున్న ట్రాక్టర్ సహాయంతో లారీని పక్కకు లాగించి, ట్రాఫిక్ పునరుద్ధరించారు.

గర్వపడేలా సీఎం జగన్ పాలన

- 98 శాతం మేనిఫెస్టోను అమలు చేసిన ఘనత ఈ ప్రభుత్వానిదే
- ఏపీ ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు



మాట్లాడుతున్న ఏపీ ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు, పాల్గొన్న ప్రముఖులు

ప్రొద్దుటూరు : ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రజలందరూ గర్వపడేలా రాష్ట్రాన్ని పరిపాలిస్తున్నారని ఏపీ ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు అన్నారు. అవర్ స్టేట్ అవర్ లీడర్ వైఎస్సార్ ఇంటలెక్చువల్ ఫోరం ఆధ్వర్యంలో 'సుపరిపాలన దిశగా ఆంధ్రప్రదేశ్ రూపాంతరం' అనే అంశంపై మంగళవారం నిర్వహించిన సమావేశానికి ఫోరం రాయలసీమ కన్వీనర్ లయన్ కె.చిన్నపరెడ్డి అధ్యక్షత వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన కొమ్మినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను 98 శాతం అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌దేనన్నారు. సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేయడం సాధ్యమేనా అని మీతోపాటు తాను కూడా గత ఎన్నికల ముందు అనుకున్నానన్నారు. అధికారంలోకి వచ్చాక దానిని అమలు చేసి చూపించారన్నారు. గ్రామ సచివాలయ వ్యవస్థలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా గ్రామ పంచాయతీల్లో 50వేల కార్యాలయాలను ఏర్పాటు చేసి అభివృద్ధికి పాటుపడ్డారన్నారు. పాఠశాలలను అభివృద్ధి చేయడం, సచివాలయాలను నిర్మించడం, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లను నిర్మించడం అభివృద్ధిలో భాగం కాదా అని ప్రశ్నించారు. కొప్పర్తి పారిశ్రామిక వాడ, శ్రీసిటీలో పరిశ్రమలను ఏర్పాటు చేయడం, తీర ప్రాంతాల్లో నాలుగు పోర్టులు, 9 ఫిషింగ్ హార్బర్లను ఏర్పాటు చేయాలనే ఆలోచన ముఖ్యమంత్రికి మాత్రమే వచ్చిందన్నారు. వైజాగ్‌లో 15వేల మందికి ఉపాధి కల్పించేందుకు డాటా సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నారన్నారు.

ఆంగ్ల మాధ్యమం ఏర్పాటు హర్షణీయం

ప్రభుత్వ పాఠశాలలో ఆంగ్ల మాధ్యమం ఏర్పాటు చేయడం హర్షణీయమని కొమ్మినేని శ్రీనివాసరావు తెలిపారు. రామోజీరావు, రాధాకృష్ణ, పవన్ కల్యాణ్ తమ పిల్లలను తెలుగు మీడియంలో చదివించి ఉంటే వారికి తలవంచి నమస్కరిస్తానన్నారు. ప్రజలను మభ్య పెట్టేందుకే వారు ఇలా చెబుతున్నారన్నారు. డాక్టర్ వైఎస్సార్ ఇంటలెక్చువల్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు శాంత మూర్తి మాట్లాడుతూ తమ సంస్థలో 700 మంది సభ్యులు ఉన్నారని, వీరిలో డాక్టర్లు, లాయర్లు, ఇంజనీర్లు, ఇంటలిజెన్స్ అధికారులు, వైస్ ఛాన్సలర్లు, ఐఏఎస్‌లు ఉన్నారని తెలిపారు. ప్రజా సంకల్ప యాత్రలో ప్రజల సమస్యలను గుర్తించిన సీఎం జగన్ సుపరిపాలన సాగిస్తున్నారన్నారు. రాయలసీమ కన్వీనర్ చిన్నపరెడ్డి మాట్లాడుతూ గతంలో ప్రజలు బియ్యం కోసం ఎక్కడో ఉన్న రేషన్ షాప్‌కు వెళ్లాల్సి వచ్చేదని, ఇప్పుడు ఇంటి వద్దకే వచ్చి బియ్యం ఇస్తున్నారన్నారు. తండ్రిని మించిన పాలనను తనయుడు జగన్ అందిస్తున్నారన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి నాగరాజు మాట్లాడుతూ మహిళా సాధికారత కోసం ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. నేతన్న నేస్తం ద్వారా ఏటా రూ.24వేలు మంజూరు చేసి చేనేతలను ఆదుకుంటోందన్నారు. పద్మశాలి కార్పొరేషన్ చైర్‌పర్సన్ జింకా విజయలక్ష్మి, అధికార భాషా సంఘం సభ్యుడు డాక్టర్ తవ్వా వెంకటయ్య , డాక్టర్ వరుణ్‌కుమార్‌రెడ్డి , డాక్టర్ రాజారామ్మోహన్ రెడ్డి మాట్లాడారు. మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి, ఎంపీపీ శేఖర్ యాదవ్, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కల్లూరు నాగేంద్రారెడ్డి, కౌన్సిలర్ ఇర్ఫాన్ బాషా, ఆర్‌పీసీఏ మెంబర్ కాకర్ల నాగేశ్వరారెడ్డి, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షులు కామిశెట్టి బాబు, కోనేటి సునంద, మాజీ వైస్ ఎంపీపీ మల్లేల రాజారాంరెడ్డి, టీటీడీ బోర్డు మెంబర్ టంగుటూరు మారుతిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్ ఐఎఫ్ సమావేశం

కడప కల్చరల్ : 'అవర్ స్టేట్–అవర్ లీడర్' వైఎస్సార్ ఇంటలెక్చువల్ ఫోరం ఆధ్వర్యంలో బుధవారం ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఫోరం రాయలసీమ విభాగం కన్వీనర్ చిన్నపురెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, మేయర్ సురేష్‌బాబులతో పాటు ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడమి చైర్మన్ కె.శ్రీనివాసరావు హాజరు కానున్నట్లు వివరించారు. స్థానిక మానస ఇన్ హోటల్‌లో ఉదయం 10 గంటలకు ఈ సమావేశం నిర్వహిస్తామన్నారు.

జిల్లాలో అభ్యాసకుల నమోదు పెంచాలి

కడప ఎడ్యుకేషన్ : జిల్లాలోని ఓపెన్‌స్కూల్స్ మండల కో–ఆర్డినేటర్లంతా పది, ఇంటర్ ప్రవేశాలకు సంబంధించి అభ్యాసకుల నమోదులో జిల్లాను ప్రథమస్థానంలో నిలపాలని డీఈఓ రాఘవరెడ్డి, ఓపెన్ స్కూల్స్(ఏపీ సార్వత్రిక విద్యాపీఠం)రాష్ట్ర కో–ఆర్డినేటర్ అక్బర్ అలీ కోరారు. మంగళవారం కడపలోని డీఈఓ కార్యాలయంలో అడ్మిషన్లకు సంబంధించిన కరపత్రాలను ఓపెన్‌స్కూల్ ఓపెన్ స్కూల్స్ జిల్లా కోఆర్డినేటర్ కేవీ సుబ్బారెడ్డితో కలిసి విడుదల చేశారు. అనంతరం డీఈఓ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన సమావేశంలో అక్బర్‌అలీ మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం సంచాలకులు నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకోవడానికి మండల కో–ఆర్డినేటర్లు కృషి చేయాలన్నారు. ఈ విద్యా సంవత్సరంలో చేపట్టి న మార్పులకు అనుగుణంగా విధివిధానాలను పాటిస్తూ అడ్మిషన్లను చేయాలన్నారు. ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమీషనర్ వెంకటేసు, జిల్లా కో–ఆర్డినేటర్ కేవీ సుబ్బారెడ్డి పాల్గొన్నారు.


కరపత్రాలను విడుదల చేస్తున్న అధికారులు

• బలవన్మరణం..

కలహాలతో ఒకరు.. జీవితంపై విరక్తితో మరొకరు..

కుటుంబ కలహాలతో ఒకరు.. జీవితంపై విరక్తి చెంది మరొకరు బలవన్మరణాలకు పాల్పడ్డారు. చిన్న చిన్న మనస్పర్థలు.. నిరాశ నిస్పృహలతో అర్థంతరంగా తనువు చాలించారు. మంగళవారం వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన ఈ ఘటనల వివరాలిలా ఉన్నాయి.

▪ కుటుంబ కలహాలతో...

చింతకొమ్మదిన్నె : కుటంబ కలహాలతో అర్జున్ (30) అనే వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుని మృతిచెందినట్లు సీకె దిన్నె ఎస్ఐ భూమా అరుణ్‌రెడ్డి తెలిపారు... అర్జున్ హైదరాబాద్‌లోని హయాత్ నగర్ కాగా .. ఇంట్లో భార్యతో గొడవ పడి చింతకొమ్మదిన్నె మండలంలోని జేవీ నగర్‌లోని తన స్నేహితుడి ఇంటికి వచ్చాడు. మంగళవారం తిరిగి హైదరాబాద్‌కు వెళుతున్నానని స్నేహితుడికి చెప్పి.. జేవి నగర్ గ్రామ సమీపంలోని ముళ్లపొదల్లో గల చెట్టుకు ఉరి వేసుకుని మృతిచెందాడన్నారు. మృతుడికి భార్యా,పిల్లలు ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించి, మృతుడి బంధువులకు సమాచారం అందించారు.


మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ భూమా అరుణ్‌రెడ్డి

▪ జీవితంపై విరక్తితో..

చెన్నూరు : మండలంలోని ఉప్పరపల్లి గ్రామానికి చెందిన తుంగ చంద్రశేఖర్ (58) జీవితం మీద విరక్తి చెంది మంగళవారం పురుగుల మందు తాగి మృతి చెందినట్లు ఎస్ఐ శ్రీనివాసులురెడ్డి తెలిపారు. ఉప్పరపల్లి గ్రామానికి చెందిన చంద్రశేఖర్ మద్యానికి బానిసై ఇంట్లో గొడవ పడేవాడు. గొడవ పడినప్పుడల్లా అతను భార్యాబిడ్డలను వదిలేసి సంవత్సరాల తరబడి బయట ఉండేవాడు. చంద్రకు భార్యతో పాటు ఇద్దరు కొడుకులు, ఒక కుమార్తె ఉన్నారు. పిల్లలందరికీ పెళ్లిళ్లయ్యాయి. ఈ నేపథ్యంలో చంద్రశేఖర్ ఒంటరిగా పొలం వద్ద గల ఇంట్లో ఉంటూ జీవితంపై విరక్తి చెంది పురుగుల మందు తాగి మృతి చెందాడని ఎస్సై శ్రీనివాసులు రెడ్డి తెలిపారు. మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించారు.


మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసు

వేంపల్లెలో పట్టపగలే చోరీ

40తులాల బంగారు ఆభరణాలు అపహరణ

వేంపల్లె : వేంపల్లె పట్టణంలోని పులివెందుల రోడ్డులో ఉన్న రెడ్డినగర్ ప్రాంతంలో మంగళవారం పట్టపగలే చోరీ జరిగింది. ఇంటి యజమాని గజ్జల సౌభాగ్య ఫిర్యాదు మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గజ్జల సౌభాగ్య తన ఇద్దరు కుమార్తెలు దామినిరెడ్డి, ధరణిరెడ్డితో కలిసి రెడ్డినగర్ ప్రాంతంలో నివాసముంటున్నారు. భర్త గజ్జల మధుసూదన్‌రెడ్డి ఏడాది క్రితం మృతి చెందారు. పెద్ద కుమార్తె దామినికి అవసరమైన వస్తువుల కోసం మంగళవారం ఉదయం కడపకు బయలుదేరి వెళ్లారు. అలాగే చిన్న కుమార్తె ధరణిరెడ్డి స్థానికంగా ఉన్న పాఠశాలకు వెళ్లింది. మధ్యాహ్నం చిన్న కుమార్తె ఇంటికి రాగా తలుపులు గడేలు పగులగొట్టి తెరిచి ఉండటంతో భయమేసి ఇంటి పక్కన నివాసముంటున్న బాబురెడ్డికి ఈ విషయాన్ని తెలిపింది. అతను లోపలికి వెళ్లి చూడగా అప్పటికే ఇంట్లో ఉన్న బీరువా పగులగొట్టి దొంగలు బంగారు ఆభరణాలు అపహరించినట్లు తెలిసింది. ఈ విషయాన్ని తల్లి సౌభాగ్యకు తెలిపారు. అనంతరం వేంపల్లె పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ తిరుపాల్ నాయక్ హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్ బృందాలతో విస్తృతంగా గాలించారు. సుమారు 40తులాల బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్లు సౌభాగ్య ఫిర్యాదులో పేర్కొన్నారు.


చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న సీఐ, ఎస్ఐలు


ఇంట్లో బీరువాలోని వస్తువులు చిందర వందరగా ఉన్న దృశ్యం

నకిలీ బంగారంతో బ్యాంకులకు టోకరా

- చిరు వ్యాపారులు, అమాయకులు బలి
- టీడీపీ శ్రేణుల నిర్వాకం


కొదవ పెట్టిన నకిలీ బంగారు గాజులు

లింగాల : లింగాల మండలంలోని పార్నపల్లె స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, లింగాల ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్‌లలో నకిలీ బంగారు ఆభరణాలు తాకట్టు పెట్టి లక్షల రూపాయలు రుణాలు తీసుకున్న ఘటన వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే.. లింగాల మండలం ఎగువపల్లె గ్రామానికి చెందిన టీడీపీ అభిమానులు జగదీశ్వర రెడ్డి, లావనూరు మండలం లావనూరు గ్రామానికి చెందిన భాస్కర్‌రెడ్డిలతోపాటు మరికొంతమంది కలిసి ముంబాయిలో రాగి గాజులపై బంగారు పూత డబుల్ కోటింగ్ వేయించి బ్యాంకులలో కొదవ పెట్టారు. ఈ నకిలీ బంగారాన్ని కొదవ పెట్టేందుకు చిరు వ్యాపారులను, అమాయకులను ఎంచుకున్నారు. వారికి లక్షకు రూ.10వేల నుంచి రూ.25వేలు నగదు ఇస్తామని ఆశ చూపి వారిచే బ్యాంకులలో నకిలీ బంగారాన్ని తాకట్టు పెట్టి రుణాలు పొందారు. అయితే రుణం పొంది ఏడాది పూర్తి కావడంతో బంగారు రుణాన్ని రెన్యువల్ చేసుకోవాలని.. లేదా విడిపించుకోవాలని బ్యాంకు సిబ్బంది రుణాలు పొందిన వారికి నోటీసులు పంపారు. వారు స్పందించకపోవడంతో వేలం వేసుకోవాలని చెప్పినట్లు సమాచారం. బంగారాన్ని తనిఖీ చేయగా.. అది నకిలీ బంగారమని తేలింది. దీంతో బ్యాంకు అధికారులలో అలజడి రేగింది. వెంటనే అన్ని బ్యాంకులు వారి, వారి బంగారాన్ని తనిఖీ చేయడం మొదలు పెట్టారు. తొలుత పులివెందుల మండలం నల్లపురెడ్డిపల్లె ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్‌లో బయటపడగా.. లింగాల ఏపీజీబీ, పార్నపల్లె స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్యాంక్‌లలో బంగారాన్ని తనిఖీలు నిర్వహించారు. ఈ బ్యాంక్‌లలో కొదవ పెట్టిన బంగారం అన్ని బ్యాంకులలోనూ గాజులే ప్రధానంగా నకిలీవని తేలాయి. దీంతో రుణాలు పొందిన వారిని విచారించగా.. అవి తమ ఆభరణాలు కావని.. పై వ్యక్తుల పేర్లు చెప్పినట్లు సమాచారం. దీనిపై పోలీసులకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేయలేదని ఎస్ఐ తెలిపారు. బ్యాంక్ మేనేజర్లను విచారించగా.. జరిగింది వాస్తవమని.. పూర్తి వివరాలు వెల్లడించలేమని అన్నారు. పార్నపల్లెలో పూల వ్యాపారం చేసుకునే మల్లగుండ్ల లక్ష్మీదేవి, మల్లేశ్వరి, భారతి, రంగస్వామి గంగమ్మలు ఉన్నట్లు సమాచారం. అదేవిధంగా లింగాల ఏపీజీబీలో బోనాల గ్రామానికి చెందిన కొమ్మా మహేశ్వరరెడ్డి, గుణకణపల్లెకు చెందిన సునీత, ఎగువపల్లెకు చెందిన జగదీశ్వరరెడ్డిలతోపాటు మరికొంతమంది ఉన్నట్లు సమాచారం. త్వరలో ఆర్ఎం వస్తారని.. ఆయన ద్వారా స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తామని వెల్లడించారు.

కువైట్ నుంచి స్వగ్రామానికి మృతదేహం


నరసారెడ్డి(ఫైల్)

అట్లూరు : ఇటీవల కువైటులో మృతి చెందిన పొన్నఓలు నరసారెడ్డి(48)మృతదేహం మంగళవారం సాయంత్రం అట్లూరు మండలంలోని మృతుని స్వగ్రామం బోడిశెట్టిపల్లికి చేరింది. మృతుని కుటుంబ సభ్యుల వివరాల మేరకు... నరసారెడ్డి జీవనోపాధి కోసం కువైటు దేశం వెళ్లాడు. అక్కడ బిల్డింగు పనులు చేసుకుంటూ ఉండేవాడు. గత నెల 27వ తేదీన బిల్డింగు లిఫ్టు గుంతలో పడి చనిపోయాడు. మృతుడి సోదరుడు పొన్నఓలు శేషారెడ్డి మంగళవారం మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకువచ్చాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి


కొండయ్య (ఫైల్)

గోపవరం : మండలంలోని బేతాయపల్లె పంచాయతీ ప్రాజెక్టుకాలనీ–2కు చెందిన అక్కిదాసరికొండయ్య (67) మంగళవారం విద్యుత్ షాక్‌కు గురై మృతిచెందాడు. భూమిరెడ్డిపల్లెలో ఓ రైతు పొలంలో విద్యుత్ లైన్ మరమ్మతులు చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. వెంటనే స్థానికులు బద్వేలులోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని బద్వేలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తల్లిదండ్రులకు అమ్మాయి అప్పగింత

బద్వేలు అర్బన్ : తల్లిదండ్రులకు, భర్తకు చెప్పకుండా ఇంటి నుంచి పారిపోయి వచ్చిన ఓ వివాహితను సోమవారం రాత్రి బద్వేలు పోలీసులు గుర్తించి మంగళవారం ఉదయం తల్లిదండ్రులకు అప్పగించారు. వివరాల్లోకి వెళితే.. కర్నూలు జిల్లా శివప్పనగర్ కల్లూరు ఎస్టేట్‌కు చెందిన 16 ఏళ్ల అమ్మాయికి మూడు నెలల క్రితం ఏకాంబరేశ్వరరెడ్డితో వివాహమైంది. అయితే భర్తతో ఏర్పడిన మనస్పర్థలతో సదరు అమ్మాయి తల్లిదండ్రులకు చెప్పకుండా బంగారు, నగలతో సోమవారం రాత్రి ఇంటి నుంచి పారిపోయి వచ్చి బద్వేలు ఆర్టీసీ బస్టాండులో నెల్లూరుకు వెళ్లేందుకు సిద్ధమైంది. ఇదే సమయంలో రాత్రి విధుల్లో భాగంగా బస్టాండుకు వచ్చిన ఏఎస్ఐ సి.వెంకటేశ్వర్లు, సిబ్బంది అనుమానాస్పదంగా సంచరిస్తున్న అమ్మాయిని విచారించి అసలు విషయం తెలుసుకున్నారు. వెంటనే అమ్మాయి తల్లిదండ్రులకు సమాచారమిచ్చి వారిని బద్వేలు అర్బన్ స్టేషన్‌కు పిలిపించి వారికి అప్పగించారు. ఇంటి నుంచి పారిపోయేందుకు యత్నించిన అమ్మాయిని గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించిన ఏఎస్ఐ వెంకటేశ్వర్లు, కానిస్టేబుళ్ళు ఓబులేసు, సుబ్బరాయుడు, కోటేశ్వరయ్య, వెంకటరామయ్య, హోంగార్డు రంగనాయకులును అర్బన్ సీఐ జీ.వెంకటేశ్వర్లు, ఎస్ఐ కత్తివెంకటరమణ అభినందించారు.

నిధుల దుర్వినియోగంపై కొనసాగుతున్న విచారణ

వల్లూరు : వల్లూరు వైఎస్ఆర్ క్రాంతి పథం (వెలుగు) కార్యాలయంలో జరిగిన నిధుల దుర్వినియోగానికి సంబంధించి గత నెల 11 నుంచి ప్రారంభమైన థర్డ్ పార్టీ విచారణ కొనసాగుతోంది. సబ్ డివిజనల్ కో ఆపరేటివ్ ఆఫీసర్ సత్యానందం ఆధ్వర్యంలో విచారణ జరుగుతోంది. ఇందులో భాగంగా మంగళవారం నిధుల దుర్వినియోగంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న సీసీ సునీతను విచారించి వివరాలను నమోదు చేశారు. అనంతరం 2014 సంవత్సరం నుంచి ఇక్కడ పని చేసిన ఏపీఎంలను విచారించారు. ఈ కార్యక్రమంలో సహకార శాఖ సీనియర్ అసిస్టెంట్ మురళీ, ఏరియా కోఆర్డినేటర్ రఘునాథరెడ్డి, ఏపీఎం శైలజ, సీసీలు, వీవోఏలు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగుల పరీక్షలకు సర్వం సిద్ధం

- జిల్లాలో ఆరు కేంద్రాల ఏర్పాటు
- డీఆర్వో గంగాధర్‌గౌడ్


మాట్లాడుతున్న డీఆర్వో గంగాధర్‌గౌడ్

కడప సెవెన్‌రోడ్స్ : ఏపీపీఎస్సీ ఆధ్వర్యంలో ఈనెల 2 నుంచి 7వ తేది వరకు జిల్లాలో నిర్వహించనున్న ప్రభుత్వ ఉద్యోగుల పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని డీఆర్వో గంగాధర్‌గౌడ్ ఆదేశించారు. మంగళవారం ఏపీపీఎస్సీ అధికారులు, చీఫ్ సూపరింటెండెంట్లు, సంబంధిత శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో పరీక్షల ఏర్పాట్లను సమీక్షించి పలు సూచనలు చేశారు. గత పరీక్షల అనుభవాలను దృష్టిలో ఉంచుకుని అవి పునరావృతం కాకుండా చూడాలన్నారు. మాల్ ప్రాక్టీస్‌కు ఏమాత్రం అవకాశం ఇవ్వరాదని స్పష్టం చేశారు. అభ్యర్థులను పరీక్షా కేంద్రంలోకి అనుమతించే సమయంలో అన్ని జాగ్రత్తలు తీసుకుని క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. బయోమెట్రిక్ తీసుకుని లోపలికి పంపిన అభ్యర్థి పరీక్ష ముగిసిన తర్వాతే బయటికి వచ్చేలా చూడాలన్నారు. విద్యుత్ సరఫరాకు ఎలాంటి అంతరాయం లేకుండా చూడాలన్నారు. హాల్ టిక్కెట్లతోపాటు అభ్యర్థులను ర్యాండమ్‌గా పరిశీలించాలని చెప్పారు. ప్రశ్నపత్రాలు ఇచ్చే సమయంలో బార్ కోడ్ పరిశీలించాలన్నారు. ఉదయం 8.00 గంటలకే పరీక్షా కేంద్రాల వద్దకు పోలీసులు చేరుకోవాలని సూచించారు. వైద్యాధికారులు ప్రతి కేంద్రంలో ప్రథమ చికిత్స సామాగ్రిని ఏర్పాటు చేయాలన్నారు. పరీక్షా కేంద్రాల సమీపంలో జిరాక్స్ కేంద్రాలను మూసివేయాలన్నారు. ఆర్టీసీ బస్సులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు నడిచేలా చూడాలన్నారు.

పరీక్షా కేంద్రాలు–లైజన్ అధికారులు

ఉద్యోగుల పరీక్షల నిర్వహణకు జిల్లాలో ఆరు కేంద్రాలను, లైజన్ అధికారులను నియమించారు. కడప నగరంలో అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాల కేంద్రానికి లైజన్ అధికారిగా ఎస్.బాలకృష్ణ (9573264346), కేఓఆర్ఎం కేంద్రానికి జె.లక్షుమ్మ (88869 68543), స్విస్ట్ ఇంజనీరింగ్ కాలేజీకి పి.స్పందన (6301757617), శ్రీనివాస ఇంజనీరింగ్ కాలేజీకి జి.చంద్రశేఖర్ (9052659424), ప్రొద్దుటూరు సాయిరాజేశ్వరీ ఇంజనీరింగ్ కాలేజీకి జె.మనోహర్‌రెడ్డి (94409 72221), సీబీఐటీ ఇంజనీరింగ్ కాలేజీకి ఎల్.వరద కిశోర్‌రెడ్డి (8919992723)లను నియమించామని వివరించారు.

పరీక్షా వేళలు

ఉదయం 10.00 నుంచి 12.00 గంటల వరకు, మధ్యాహ్నం 3.00 నుంచి 5.00 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారు. ఇక కన్వెన్షనల్ టైప్ పేపర్లపై పరీక్షలు రాసే అభ్యర్థులకు ఉదయం 10.00 నుంచి మధ్యాహ్నం 1.00 గంట వరకు, మధ్యాహ్నం 3.00 నుంచి 6.00 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారు. ఈ పరీక్షల్లో 2799 మంది అభ్యర్థులు హాజరు కానున్నట్లు డీఆర్వో వివరించారు. ఈ సమావేశంలో ఏపీపీఎస్సీ అసిస్టెంట్ సెక్రటరీ ఎస్.నాగూర్ షరీఫ్, అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ ఎస్.ఖాసింవలీ తదితరులు పాల్గొన్నారు.